# తొలి రాత్రి

కె. రవికుమార్

ఎన్నేళ్ళో ఆగి పెళ్ళిచేసుకున్న రావ్‌కి ఒకపెద్ద గొంతెమ్మ కోరిక గొంతుమీద కూర్చుండి పోయింది. మొదటిరాత్రి అంటే శోభనం నాటి రాత్రి భార్యతో పూర్తిగా మనసు విప్పి మాట్లాడుకోవాలనీ, ఒకరి కొకరు పరిచయాల దగ్గర్నుంచి ఆశయాల వరకు చెప్పుకోవాలని కోరిక.

శోభనం రాత్రి రానేవచ్చింది. గదినిండా సుగంధ పరిమళాలు. పందిరి మంచం అంతా మల్లెపూల మాలలతో అలంకరించబడి వుంది. మెత్తని పరుపుమీద తెల్లటి దుప్పటి. దుప్పటి మీద "స్వీట్‌నైట్" అని రంగు రంగుల పూలతో అలంకరించబడి వుంది. అన్ని వేపులా గులాబి రేకుల, మల్లెలు చల్లబడి వున్నాయి. ప్రక్కనే వున్న టేబిల్ మీద పళ్ళేలనిండా నేతి మిఠాయిలు. వాటి ప్రక్కన కాలుతున్న సుగంధ అగరుబత్తీలు.

అన్ని వేడుకలూ పూర్తిచేసి ముస్తాబు చేసిన పెళ్ళికూతురిని లోపలికి పంపారు. ఆమె అడుగు పెట్టగానే బయటనుంచి తలుపులు వాటంతటవే ధఢేల్మని మూసుకుపోయాయి. కుమారి....అంటే .... నూతన వధువు తలుపు దగ్గరే నిల్చుని నేలచూపులు చూస్తూ సిగ్గుపడుతోంది.

రావ్ లేచి పంచకట్టు సర్దుకుని ఠీవిగా ఆమెను సమీపించి, "శ్రీమతి గారూ! ఇక్కడ యితరు లెవ్వరూ లేరుగా! సిగ్గు చాలించి తిన్నగా శయ్యాగారాన్ని అలంకరించండి మరి" అంటూ ఆమె చేయి పట్టుకొని చరచరా లాక్కు వచ్చి పందిరి మంచం మీద కూర్చోబెట్టాడు. తాను కూడా ఆమె ప్రక్కనే ఆసీనుడయ్యాడు. మెల్లగా ఆమె భుజం మీద నుండి చేయివేసి ఆమెను పొదివి పట్టుకున్నాడు. క్రమంగా మాటల్లోకి దించాడు. ముందుగా తాను చెప్పాలనుకున్నవన్నీ దంచేశాడు. అప్పటికి రాత్రి పన్నెండు దాటింది. అయినా రావ్ యింకా మాట్లాడుతూనే వున్నాడు

"చూడు కుమారీ! పాత రోజులు పారిపోయాయి. క్రొత్త రోజులు వచ్చాయి. రోజులతో పాటు మనం, మనతో పాటు మన భావాలూ అన్నీ మారాలి. సంకుచితత్వం నశించాలి. మనమూ, మన మనస్సులూ విశాలం కావాలి. నాకు 'నేరోమైండెడ్' వాళ్ళంటే పరమ అసహ్యం. నువ్వేమీ అనుకోనంటే నా పాత కథలు గత జీవితాన్ని నీ ముందు పెట్టాను. మన మధ్య అడ్డు తెర యుండకూడదు. అవన్నీ తొలగించేసుకోవాలి. పెళ్ళంటే నూరేళ్ళ పంట. అరమరికలతో జీవితాన్ని నరకం చేసుకో కూడదు మరి, నా చరిత్ర కాస్త విశాల భావాలతో అర్థం చేసుకుంటావ్ కదూ!" అడిగాడు రావ్. అప్పటివరకు కాస్త చనువు సంపాదించుకున్న కుమారి "అలాగే!" అంటూ సమాధానమిచ్చింది.

రావ్ ప్రేమ కథలు ఒక్కొక్కటే చెప్పేశాడు. చివరకు "చూడు కుమారీ! "సరోజను నేను ప్రేమించలేను. విమలనూ నేను ప్రేమించలేను! వాళ్ళే నా వెంటబడి వుత్తరాలతో, కవ్వింపులతో నన్ను వేధించుకు తిన్నారు. వాళ్ళను అమాంతం డిసప్పాయింట్ చేయటం యిష్టంలేక ఏదో కొంత కాలంపాటు సినిమాలకూ. షికార్లకూ తిప్పాను. ఇక పోతే రామలక్ష్మి అంటావా! ఆమె కథ

విన్నావుగా. ఆమెను ఒకప్పుడు మనసారా ఆరాధించాను. నిష్కల్మషంగా ప్రేమించాను. కాని నా విలువ, నా ఆశయాల విలువ తెలీని వాళ్ళ పెద్దలు మూర్ఖంగా పట్టు బట్టి నాకు కాకుండా చేశారు. అయినా నాకు బాధ లేదు. "ఫ్లూ" పడి లేచినట్లు నా ప్రాణాలు ఫీలయ్యాను. తర్వాత జరిగేవన్నీ మన మంచికే అని సమాధాన పడి ఆమెను మర్చి పోయాను. ఇపుడు నాతో స్నేహంగా వుంటున్న లత, సుజాతలు వివాహితులు కేవలం నా ఫ్రెండ్స్. మా మధ్య ఏ విధ మయిన చెడు సంబంధాలూ లేవు. నాకు రాజన్, కరుణాకర్ అనే మిత్రులున్నారని. చెప్పాను. వాళ్ళ లాగే వీళ్ళనుకూడా స్నేహ భావంతో చూస్తాను తప్ప 'సెక్స్ డిఫరెన్స్ పట్టించుకోను. నువ్ నమ్మూ నమ్మకపో. వున్నసంగతి అది. అయినా నీ కిష్టంలేదంటే రేపటి నుంచీ వాళ్ళతో స్నేహం కటాఫ్ చేసేస్తాను." చిన్నగా నవ్వుతూ ఆమెను మరింత దగ్గరకు లాక్కున్నాడు.

"ఇవన్నీ విని బాధపడుతున్నావా కుమారీ! ప్చ్! అలా బాధపడితే లైఫ్ లేదు. నవీన భావాలతో విశాల హృదయంతో వుండాలని ముందే చెప్పానుగా. యామై రాంగ్ యిన్ ఎనీ వే?" అంటూ ఆమెను నుదుటి మీద ముద్దు పెట్టుకున్నాడు.

హైదరాబాద్‌లో పెద్ద ఆఫీసరుగా చేస్తున్న రావ్ తనకు భర్తగా దొరకటం కష్టమని వూరూవాడా అందరూ తనని తెగ పొగి డేశారు. అంత పెద్ద ఆఫీసర్లు యిలాటివి చేసినా తప్పేమీ కాదని, పైగా వీటిని తాను విశాల భావాలతో అర్థం చేసుకోవాలని రావ్ అప్పటివరకూ నూరిపోశాడు. కుమారి ఏమీ అనలేకపోయింది. మెల్లగా "అబ్బే వీటిలో ఏముందిలెండి. నన్ను ప్రేమగా చూసు కుంటూ మీ హృదయంలో యింత చోటిస్తే చాలు" తికమక పడ్తూ అంది అనేక నవలలు చదివిన కుమారి.

రావ్ సగర్వంగా నవ్వాడు. కూజాలో నీళ్లు గ్లాసులోకి వంచుకుని త్రాగాడు. "కుమారీ! ....సారీ....దేవీ! నీ క్కూడా కావాలా అంటూ కాసిని నీళ్లుంచి గ్లాసు నోటికి అందించాడు. కుమారి సిగ్గుతో ముడుచుకు పోయింది. ఎలాగో గ్లాసు అందుకుని రెండు గుటకలు వేసి టేబిల్ మీద పెట్టేసింది.

రావ్ మళ్ళీ మొదలుపెట్టాడు. "ఇఫ్ యు డోంట్ మైండ్ నే నో విషయం అడ గనా?" అన్నాడు.

"అడగండీ!" అంది తలవంచుకునే.

"ఇంత వరకూ నీ జీవితంలో ఏవైనా యిలాటి కథలు గాని, సంఘటనలు గాని జరి గాయా?"

అనుకోని ప్రశ్నకు కొస్త చలించింది కుమారి. 'ఏమిటి యీయన యిలా అడుగు తున్నాడు. కొంపదీసి నా మీద అనుమాన పడటం లేదుగదా!'అనుకుంటూ వూరుకుంది.

"చెప్పు దేవీ! నే నేమీ అనుకోనులే. అయామ్ నాట్ నేరో మైండెడ్" అన్నాడు తేలిగ్గా.

"అబ్బే! ఏమీలేవు" అనేసింది అప్రయ త్నంగా.

"అదిగో అదే వద్దన్నాను. నాదగ్గర దాప రికం ఎందుకు? నాలాటి విశాల హృదయుడు, సంస్కారి యింత వరకు పుట్టలేదని మా ఆఫీసువాళ్ళంతా అనుకోని క్షణం వుండ దనుకో. నా గురించి నేను చెప్పుకుంటే బావుండదు. రేపటినుంచీ నువ్వే చూస్తావ్‌గా"

కుమారికి ఎలా సమాధానం చెప్పాలో తోచలేదు. నిజానికి తనకు తెలిసినంతవరకూ యిలాటి కథలేవీ లేవు.

"మై డార్లింగ్ కుమారీ! కో ఎడ్యుకేషన్ కాలేజీనుంచి డిగ్రీ పుచ్చుకున్న దానివి. ఆ మాత్రం ఎక్స్‌పీరియన్సెస్ లేవంటే ఎలా నమ్మేది! ప్లీజ్ చెప్పు. కథల్లావిని ఎంజాయ్ చేస్తాను. నాకిటువంటివేమీ పట్టింపు వుండవు.

అసలు సినెన్నో విడో మారేజెస్ చేయించాను. నేను కూడా చేసుకుంటానని ఆదర్శంగా ముందుకు వచ్చాను. ఓసారి పేపర్లో కూడా వేయించుకున్నాను. కాని మా నాన్న పుత్త చాంధస్తుడు. ఆయన మాటకు ఎదురు చెప్ప లేక సాంప్రదాయంగా నిన్ను చేసుకున్నాను. ఇకమీద నిన్ను దేవతలా చూసుకుంటాను. నీగత చరిత్రతో నాకు పనిలేదు. సరదాగా అడిగాను. చెప్పవూ" ప్రాధేయ పడు తున్నట్లు అడిగాడు.

కుమారి ఆలోచనలో పడింది. గతాన్ని ఓసారి మనసులో దిమ్మరించి వెదుకుతోంది. వున్నట్లుండి ఏదో జ్ఞాపకం వచ్చినట్లు తల ఎత్తింది. మళ్ళీ దించేసింది. సందేహంగా, భయంగా ఓసారి రావ్‌ని ఓరకంట చూసింది.

"హమ్మయ్య. దారికి వచ్చావ్! ఏదో చెప్పబోతూ భయపడుతున్నావ్ కదూ! ఇందులో భయపడాల్సిన పనే లేదు. నేను చెప్పలా నా అనుభవాలన్నీ!" ఎంకరేజ్ చేశాడు రావ్.

కుమారి, రావ్‌ను సూటిగా చూసింది. రావ్ ప్రశాంతంగా, చిద్విలాసంగా కన్పిం చాడు. ఫర్వాలేదనుకుంది.

"నాకు పెద్ద కథలేవీ లేవుగానండీ! నేను థోర్డు ఫారం చదివే రోజుల్లో మా యింటి ఎదురు పోర్షన్‌లో ఒకళ్ళు కొత్తగా దిగారు. భార్య, భర్త, యిద్దరు పిల్లలు. అతను ఏదో బిజినెస్ చేసేవాడట. అప్పటికి అతనికి పాతికా, ముప్పయి మధ్య వయసు. కాని అతను చాల అందగాడు. అతన్ని చూసి నప్పటినుండీ, తెలిసీ తెలీని వయసు కావటం వల్లనాలో ఏదో ఆరాధన మొదలైంది. అత నితో పరిచయం చేసుకోవాలనీ, సన్నిహి తంగా వుండాలని మనసు వేధించేది. కాని నేను స్కూల్లో చదివే చిన్నపిల్లను కావటం వల్ల అతని దృష్టికి రాలేదు నన్నూ, నా ఆరాధనలను గుర్తించలేదు. ఎప్పుడూ అతనితో మాట్లాడే అవకాశమే దొరకలేదు.

తర్వాత మా నాన్నగారికి ట్రాన్స్‌ఫర్ వచ్చి, మేము వచ్చేశాము అతన్ని పూర్తిగా మర్చి పోయాను. కాని, అలా వివాహితుడిని ఆరా ధించటం ఎంతోతప్పని ఆ విషయం గుర్తుకు వచ్చినప్పుడల్లా అనుకుంటుంటాను. అదే అతను నా బాలకాన్ని పసిగట్టి నన్ను తేలిగ్గా లొంగ దీసుకుంటే ఏమయి పోయేదాన్నో కదా అని పెద్ద గండం గడిచినట్లు చాలాసార్లు ఫీలయ్యాను. అప్పటి నా పిచ్చి ఆవేశానికి పశ్చాత్తాప పడ్డాను కూడా. నాకే విధమయిన దోషం రాకుండా కాపాడినందుకు ఆ భగ వంతుడికి ఎన్నోసార్లు థ్యాంక్స్ చెప్పు కున్నాను. ఈ విషయం మర్చి పోయి కూడా చాల కాలమయింది. మీరు అంతగా అడిగా రనియిప్పుడు గుర్తుకు తెచ్చుకుని చెప్తున్నాను. అంతకు మించి నా జీవితంలో ఏవిధమైన కథలూ అనుభవాలూ లేవు." అంటూ రావ్ ముఖంలోకి చూసింది బరువు దించుకున్నట్లు.

ఆశ్చర్యంగా! రావ్ చెప్పిన విశాల భావాలు కాని సంస్కారం కాని అతని ముఖంలో లేవు. అన్నీ ఒక్కపెట్టున ఎటో ఎగిరి పోయినట్లున్నాయి. అతని ముఖం కంద గడ్డలా మారిపోయింది. కళ్ళెర్రబడ్డాయి. నరాలు బిగుసు కున్నాయి.

"నో .... యూ యిడియట్" అంటూ ఆమె నుంచి దూరంగా వెళ్ళాడు. "యువర్స్ యీజ్ ఎ సెకెండ్ హాండ్ లవ్" అంటూ మిఠాయి పళ్ళాలు నేలమీద విసరికొట్టి, జుట్టు పీక్కుని, పందిరి మంచానికి అలంకరించిన పూల దండలన్నీ తెంపేసి మంచం ఎక్కి కోతిలాగా గెంతాడు.

ఈ హఠాత్పరిణామానికి కుమారి బేజా రెత్తిపోయింది. గుండెను గుప్పిట్లో పెట్టుకుని అలా క్షణాల్లో తెలివి తప్పి పడిపోయింది.